క్లుప్తంగా

ఘనంగా ఓలా నవమి పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

భామిని: కార్తీకమాసంలో కీలకమైన ఓలా నవమి సందర్భంగా వైష్ణవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బత్తిలి రాధాబృందావన చంద్రస్వామి మఠంలో రాధాకృష్ణులకు విశిష్ట పూజలు చేపట్టారు. ఓలా నవమి సందర్భంగా రాధాదేవి పురుష అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు ఉసిరి చెట్టు కింద భోజనాలు చేశారు. లివిరి గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

కొండచిలువ హతం



గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువను చూపుతున్న యువకుడు

భామిని: మండలంలోని నేరడి–బిలో భారీ కొండచిలువను గ్రామస్తులు ఆదివారం కొట్టి చంపారు. వంశధార నదికి దగ్గరగా ఉన్న దళితవాడలో సుమారు ఆరడుగుల కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే యువత స్పందించి కొండచిలువను హతమార్చారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా ఆలయ వార్షికోత్సవం



మెహర్ బాబా ప్రబోధనలు వినిపిస్తున్న వక్తలు, కమిటీ సభ్యులు

పాలకొండ రూరల్: అవతార్ మెహర్‌బాబా ఆలయ 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఉన్న బాబా మందిర ప్రాంగణంను సుందరంగా తీర్చిదిద్దారు. బాబా ప్రబోధనలు వివరించడంతో పాటు వాటిని అనుసరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం సప్తవర్ణ పతాక ఆవిష్కరణ, ప్రేమిక సహవాస్, మెహెరు సంకీర్ణ కార్యక్రమాలతో పాటు తిరువీధి నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు పి.భాస్కరరావు, కేవీ.రమణ, కె.కేశవరావు, తదితరులు పర్యవేక్షించారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమ పూజలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నిత్యపూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో, అర్చకులు ఎస్.శ్రీనివాసరావు, రఘుశాస్త్రి ఆధ్వర్యంలో జై గురు దత్త హోమ పూజలు, శ్రీచక్ర అర్చన, మహాలింగార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతీపురం, వీరఘట్టం, హిరమండలం, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

జియ్యమ్మవలస: మండలంలోని గిరిజన సంక్షేమ వసతిగృహాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆదివారం సందర్శించారు. ఇటీవల గిరిజన విద్యార్థులు మృతి చెందడంపై ఆరా తీశారు. టీకేజమ్ము వసతిగృహంలో విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. సంబంధిత ఉపాధ్యాయులు, వార్డెన్, ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు భోజనాల నాణ్యత, వసతులను పరిశీలించాలన్నారు. ఆహారం ఎటువంటి కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు కె.మల్లేశం, ఎం.శివ ఉన్నారు.



ఉల్లి సాగుతో లాభాలు..

- నీరు నిలవని సారవంతమైన నేలలు అనుకూలం
- సస్యరక్షణ చేపట్టాలి
- వ్యవసాయాధికారి వాహిని

పాలకొండ రూరల్: వాణిజ్య పంటల సాగులో భాగంగా రైతులు ప్రస్తుత సీజన్‌లో ఉల్లి సాగుకు ముందుకు వస్తే మంచి లాభాలు కళ్లజూడవచ్చని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని తెలిపారు. ఉల్లి నారు వేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా నీరు నిలవని సారవంతమైన ఎర్ర నేలలు, అధిక సేంద్రియ పదార్థాలు కలిగిన నేలలు ఈ పంటకు అనుకూలమని తెలిపారు.

మెలకువలు తప్పనిసరి...

ఉల్లిలో తెల్లగెడ్డ, మిల్క్‌వైట్, హైబ్రీడ్ రకాలతో పాటు ఎర్రగడ్డ రకాలు అందుబాటులో ఉంటాయి. రైతులు ఉల్లిపంట వేసేటప్పుడు ఎకరాకు 3 నుంచి 4 కిలోలు విత్తనాలు సరిపోతాయి. తొలిత నేలను భాగా దున్ని 4 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు, 15 సెంటీమీటర్ల ఎత్తులో 10 నారుమడులు తయారు చేసుకోవాలి. మడిలో విత్తనాన్ని పలుచగా వరుసల్లో వేసుకోవాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా 10 రోజులకు ఒకసారి బైలటాక్స్ 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నారు మొలకెత్తిన 20 నుంచి 25 రోజుల మధ్యలో కార్బోఫ్యూరాన్ 3–జీ గుళికలు 100 గ్రాములు ఇసుకలో కలిపి చల్లాలి.

నారు వేయడం...

పొలాన్ని నాలుగైదు సార్లు దున్ని చదును చేసుకుని 30 సెంటీమీటర్ల దూరంలో బోదెలు తయారు చేసుకుని ఇరువైపుల నారు నాటాలి. ముందుగా నారును తయారు చేసుకున్న రైతులు వీటిని సక్రమంగా సానుకూల సమయంలో వేయడంవల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు. నవంబర్ నుంచి డిసెంబర్ వరకు కూడా ఉల్లి వేసుకునేందుకు అవకాశాలున్నాయి. నారు నాటిన రెండో రోజు పెండిమిథాలియన్ 1.2 లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిసి నారు తడిచేలా పైపాటుగా పిచికారీ చేయాలి. ఎప్పటికప్పుడు కలుపు నివారణపై దృష్టి పెట్టాలి. నారునాటిన 100 నుంచి 110 రోజుల మధ్య కార్బండిజమ్ ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఉల్లిపాయలు కుళ్లిపోవు. ఉల్లి పంటలో ఆకులు నిట్టనిలువుగా, పైన మైనంపూత ఉండడ వల్ల మందు ద్రావణం జారిపోతుంది. కాబట్టి 0.5 మిల్లీలీటర్ల జిగురు ద్రావణాన్ని ప్రతి లీటర్ మందు ద్రావణానికి కలపాల్సి ఉంటుంది.

సస్యరక్షణ...



ఆకుతినే పచ్చ పురుగు ఎక్కువగా ఉల్లి పంటకు ఆశిస్తుంది. దీని నివారణకు లీటర్ నీటిలో 3 గ్రాముల కార్బరిల్ లేదా రెండు మిల్లీల ప్రొపినోఫాస్ కలిపి పిచికారీ చేయాలి. తామరపురుగు నివారణకు లీటర్ నీటిలో రెండు మిల్లీల పిప్రోనిల్ లేదా 0.2 మిల్లీల సైపనోశాడ్ కలిపి పిచికారి చేస్తే ఈ పురుగు ఉధృతి అదుపులో ఉటుంది. వాతావరణంలో తేమ ఎక్కువైనప్పుడు ఆకుమచ్చ తెగులు కనిపిస్తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లేదా క్లోరోథాలోనిల్ 2.5 గ్రాముల చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల చీడపీడల నుంచి నివారణ పొందవచ్చు. ఆసక్తి గల రైతులు మరిన్ని మెలకువల కోసం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. – ఎన్ని వాహిని, ఏఓ

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు గిరిజనులకే కేటాయించాలి

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో ఖాళీ అయిన ఫీల్డ్‌అసిస్టెంట్ పోస్టును గిరిజన అభ్యర్థులకే కేటాయించాలని సీపీఎం నాయకులు కోరారు. బొడ్డవలసలో స్థానిక గిరిజనులతో గిరిజన సంఘ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. రెండేళ్లుగా ఫీల్డ్‌అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉందని, టెక్నికల్ అసిస్టెంట్‌తోనే విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ పోస్టును గిరిజనులతోనే భర్తీ చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు కూరంగి సీతారాం, కొల్లి గంగునాయుడు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆదివాసీ జేఏసీ నూతన కార్యవర్గం ఇదే ..



ఆదివాసీ జేఏసీ నూతన కార్యవర్గం

సీతంపేట: స్థానిక ఆదివాసీ సామాజిక భవనంలో ఆదివారం ఆదివాసీ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివాసీ ప్రజాసంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఎన్నిక నిర్వహించినట్లు జిల్లా జేఏసీ చైర్మెన్ కె.ధర్మారావు తెలిపారు. మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బిడ్డిక శ్రీనివాసరావు, సవర సాయికుమార్.. గౌరవ అధ్యక్షుడిగా హెచ్.రామస్వామి.. ప్రధానకార్యదర్శిగా సవర చిరంజీవులు.. ఉప కార్యదర్శిగా నిమ్మక తరుపతిరావు.. సహాయ కార్యదర్శిగా సవర లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా పి.తిరుమలరావు, నిమ్మక చంటి, ఎస్.గంగారావు, కె.లక్ష్మణరావు, ఆరిక గణేష్, ఎస్.మోహన్‌పాల్, బి.ఉమామహేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావు, బి.అప్పారావు, ఎస్.అబ్బాస్, ఎస్.ప్రసాద్, కె.సింహాచలం, కె.కాంతారావు.. కోశాధికారులుగా బి.సూరిబాబు, పి.ధార్మారావు, ఎస్.జమ్మురాజు, హెచ్.ఆదిలక్ష్మి, ఎన్.కోటి, బి.ఆనందరావులను ఎన్నుకున్నారు.

సమావేశం..

సీతంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్ సంఘ నాయకులు సీతంపేటలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆ శాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆరిక భాస్కరరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఈనెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనుందన్నారు. ఈ లిస్టులో చేర్పులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయగౌరి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుండంగి కృష్ణారావు, కె.ఆనందరావు, బి.పకీరు, పాలక కృష్ణారావు, దండు ప్రకాశరావు పాల్గొన్నారు.



సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

ఘన జీవామృతంతో ప్రయోజనం



రైతులతో ఘనజీవామృతం తయారు చేయిస్తున్న భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: ఘన జీవామృతం ఎరువుతో జీడిమామిడి చెట్లకు ఎంతో ప్రయోజనమని ప్రకృతి వ్యవసాయ విభాగం గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు అన్నారు. ఈమేరకు మండలంలోని చెముడుగూడ గ్రామంలోని రైతులచే ఆదివారం జీడిమామిడి తోటల్లో భూసారం పెంపొందింపజేసే ఘన జీవామృతం ఎరువును తయారు చేయించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఘనజీవామృతం ఎరువును జీడిమామిడి చెట్ల మొదలల్లో వేసుకోవడం వలన చెట్లకు కావాల్సినంత పోషకాలు లభిస్తుందని, ఫలితంగా దిగుబడి బాగా వస్తుందన్నారు. ఎకరాకు 4 కేజీల ఘనజీవామృతం ఎరువు అవసరం అవుతుందని, సహజసిద్ధంగా లభించే వస్తువులతో తయారు చేసుకోవాల్సి ఉన్నందున పెద్దగా ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉండదని, రైతులంతా ఈ విధానాన్ని అవలంబించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఎం.సుస్మ, తదితరులు ఉన్నారు.

అమరవీరులకు నివాళి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అటవీశాఖ అమరవీరుల ప్రాణత్యాగాలు మరువలేనివని అటవీశాఖ అధికారి సూర్యప్రకాష్ అన్నారు. ఈమేరకు ఆదివారం అటవీశాఖ అమర వీరుల దినోత్సవం సందర్భంగా కురుపాం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు అటవీశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారి సేవలను గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు.

మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ

- అధికారుల స్థానంలో సిబ్బంది హాజరు కావడంపై అసంతృప్తి
- తమ పనులు కావడం లేదంటూ ఆవేదన
- సమావేశం నుంచి బయటకొచ్చిన సభ్యులు
- సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించిన అధికారులు



మండల సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని సర్పంచ్‌లు ఆదివారం బహిష్కరించారు. ఎంపీపీ బి. ఆదినారాయణ అధ్యక్షతన స్థానిక యువ శిక్షణా కేంద్రంలో సమావేశం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీడీఓ కె.గీతాంజలి సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాస, ఈఓపీఆర్‌డీ కె.సత్యం సమావేశం నిర్వహణకు ఉదయం 10.30 గంటలకు హాజరయ్యారు. మండలంలో 53 పంచాయతీ సర్పంచ్‌లు, 15 మంది ఎంపీటీసీ సభ్యులుండగా.. వీరిలో కొద్దిమంది తప్ప మిగిలిన వారందరూ సమావేశానికి వచ్చారు. అధికారుల విషయానికి వస్తే మొత్తం 17 శాఖలకు గాను 10 శాఖల సిబ్బంది మాత్రమే వచ్చారు. వీరిలో ఎక్కువ మంది వివిధ విభాగాల సహాయకులు మాత్రమే రావడంతో అసంతృప్తి చెందిన సర్పంచ్‌లంతా సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. వీరితో పాటు వైస్ ఎంపీపీ కె.సరస్వతి, ఎంపీటీసీ సభ్యులు ఎస్.మంగయ్య, చంద్రశేఖర్, హరిబాబు, తదితరులు కూడా బయటకు వచ్చి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు ఎస్.తిరుపతిరావు, ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, ఎస్.సుశీల, జె.సుందరమ్మ, గన్నెమ్మ, ప్రవీణ్, బి.తిరుపతిరావు, తదితరులు మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు ముఖ్య కీలక శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరై కిందిస్థాయి సిబ్బందిని సమావేశానికి పంపిస్తే తాము సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. పైగా గ్రామాల్లో వివిధ పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో తమకు తగు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో తాము సూచించే ప్రజలకు ఉపయోగ పడే పనులు ఏవీ కావడం లేదని వాపోయారు.

మమ అనిపించారు...

మండల సమావేశానికి హాజరైన కొంతమంది ఎంపీటీసీ సభ్యులు రికార్డుపై సంతకాలు చేయడంతో వన్ బై థర్డ్ కోరం సరిపోయిందని.. తాము మండల సమావేశం నిర్వహించేసినట్టేనని అధికారులు చెప్పుకొస్తున్నారు. కనీసం సమస్యల ప్రస్తావన, సమాధానాలు లేకుండానే సమావేశం ముగించడం కొసమెరుపు. కార్యక్రమంలో సీడీపీఓ రంగలక్ష్మి, హౌసింగ్ ఏఈ గణేష్, హెచ్ఓ జయశ్రీ, ఉపాధి ఏపీఓ సాగర్, వెలుగు ఏపీఎం కమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి



కొత్త ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: అర్హులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అన్నారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని 74, 75 పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలువురు కొత్త ఓటర్లచే ఫారం–6లను నమోద చేయించారు. అలాగే ఓటర్ల పేర్లు, చిరునామా మార్పుల కోసం దరఖాస్తు చేయించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, అందుకోసం నిర్వహించే ఓటు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట వైస్ సర్పంచ్ కిషోర్ కుమార్ ఉన్నారు.

నీరు మళ్లింపులో రైతులు బిజీ



వీరఘట్టం రహదారిలో నేలకొరిగిన వరి చేను

పాలకొండ రూరల్: ఖరీఫ్ సేద్యం చివరి దశకు చేరుకున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. ఇరిగేషన్ యంత్రాంగం పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో మండంలోని శివారు ప్రాంత భూములకు సాగునీరు అందలేదు. మరో వైపు ఎగువ ప్రాంత రైతులు తమ అవసరాలకు సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీటికి అడ్డుకట్టలు వేయడంతో.. దిగువ పొలాల రైతులు వరుణుడి కరుణతో సాగు చేపట్టారు. తాజాగా వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో ఎగువ రైతులు తాము వేసిన పూనెలను తొలగించడంతో అవసరం లేని సమయంలో దిగువకు నీరు చేరుతోంది. కోత సమయంలో నీరు చేరడంతో చేసేది లేక నీటిని బయటకు మళ్లించే మార్గాలను ఏర్పాటు చేయడంలో ఆదివారం రైతులు బిజీగా ఉన్నారు. నీటి ఉధృతితో పాటు గాలులు వీయడంతో చేలు నేలకొరగటం చూసి నిట్టూరుస్తున్నారు.



నీటిని మళ్లించేందుకు మార్గాలు ఏర్పాటు చేస్తున్న రైతు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కళింగ వైశ్యులు ఆదివారం స్థానిక కోమటిపేటలో గల ఓ కల్యాణ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. 108 మంది దంపతులచే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని సంఘ సభ్యులు విజయవంతగా చేపట్టారు. అనంతరం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో నందాన సుధాకర్, కె.నాగేశ్వరరావు, వి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

లక్ష దీపారాధన



పులిపుట్టి పంచాయతీ పరిధిలోని ముక్కిడిపోలమ్మ గుడి వద్ద లక్ష దీపారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దీపాలు వెలిగించారు. కొత్తూరు, సీతంపేట, భామిని, తదితర మండలాలకు చెందిన భక్తులు పాల్గొనగా.. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – సీతంపేట

తోటపల్లిలో పిక్నిక్ సందడి



నాగావళినది తీరంలో పర్యాటకులు

గరుగుబిల్లి: మండలంలోని నాగావళి తీర ప్రాంత గ్రామాలైన తోటపల్లి, సుంకి, ఉల్లిభద్ర తదితర గ్రామాల సమీపంలోని తోటల్లో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి నాగావళి తీరంలో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తోటపల్లి పంప్‌హౌస్ సమీపంలోని తోటలు పిక్నిక్‌కు వచ్చేవారితో కళకళలాడాయి. తోటపల్లి ప్రాజెక్టును, వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు.